ప్రతిభకు పరీక్ష

- ఎంపిక చేసిన పాఠశాలల్లో 'పరఖ్' సర్వే
- 3,6,9 తరగతుల విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన
- ఈ నెల 4న పరీక్ష నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు



బలిజిపేట ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులు

బలిజిపేట:

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకునేందుకు వారికి వార్షిక పరీక్షలు నిర్వహిస్తుంటారు. అలాగే విద్యాప్రమాణాలు, ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు విద్యాశాఖ కొత్త సంస్కరణలు తీసుకొస్తుంటాయి. ఇందులో భాగంగానే ఈ నెల 4న కేంద్ర ప్రభుత్వం పెర్ఫార్మెన్స్ అసెస్‌మెంట్ రివ్యూ అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ పేరుతో పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్–2024 (గతంలో నాస్) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సర్వేను 2021లో చివరిసారిగా నిర్వహించారు. తిరిగి ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహణకు విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ఎస్‌సీఈఆర్‌టీ చర్యలు చేపట్టాయి. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో మాత్రమే దీన్ని నిర్వహిస్తారు.

మండలంలో..

బలిజిపేట మండలంలో ఈ పరీక్ష కోసం బలిజిపేట, వంతరాం ఉన్నత పాఠశాలలతో పాటు బర్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాల నుంచి 30 మంది చొప్పున మూడు తరగతుల నుంచి విద్యార్థులను ఎంపిక చేస్తారు. పరాఖ్ నిబంధనలకు అనుగుణంగా విద్యార్థుల ఎంపిక ప్రక్రియ ఉంటుంది. మండల స్థాయిలో పరీక్షల నిర్వాహకులుగా ఎంఈఓలతో పాటు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వ్యవహరిస్తారు. పరీక్షను పక్కాగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది.

పరీక్ష విధానం

ఎస్‌ఈఆర్‌టీ నిర్వహించే 'పరఖ్' పరీక్షకు ముందుగా ప్రాక్టీస్ పేపర్ల ద్వారా తర్ఫీదు ఇస్తారు. ఇందులో మూడు, ఆరు తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం, తొమ్మిదో తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్షలు ఉంటాయి. మూడో తరగతి విద్యార్థులకు అదే తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 45 ప్రశ్నలతో 90 నిమిషాల పాటు పరీక్ష ఉంటుంది. ఆరో తరగతి విద్యార్థులకు ఐదో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. 50 ప్రశ్నలతో 90 నిమిషాల పాటు పరీక్ష ఉంటుంది. తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎనిమిదో తరగతి సిలబస్ ఉంటుంది. వీరికి 60 ప్రశ్నలతో 120 నిమిషాల పాటు పరీక్ష ఉంటుంది. ఓఎంఆర్ షీటు విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు.

సామర్థ్యాలను పరీక్షించేందుకే..



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానం ఇది. దీనివల్ల విద్యార్థుల సామర్థ్యాలు, ఉపాధ్యాయులు బోధనా పద్ధతులు తెలుస్తాయి. దీనికి ప్రత్యేకించి తర్ఫీదు ఇవ్వడం జరుగుతుంది. విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సామల సింహాచలం, ఎంఈఓ–1, బలిజిపేట

క్లుప్తంగా

అవుట్ సోర్సింగ్ టీచర్ల పోరాటానికి సహకరించాలి

పార్వతీపురంటౌన్: ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోరాటానికి ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు సహకరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు శనివారం ఓ ప్రకటనలో కోరారు. గత 10 రోజులుగా రెసిడెన్షియల్ టీచర్లు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకుండా వారి స్థానంలో ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను డెప్యుటేషన్‌పై వేయాలని ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు రెసిడెన్షియల్ పాఠశాలలకు వెళ్లి పాఠాలు చెపితే, ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎవరు బోధిస్తారని ప్రశ్నించారు. కావున వెంటనే ఈ ఉత్తర్వులు రద్దు చేసి సమస్యను పరిష్కరించాలని, లేనిచో పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని తెలియజేశారు.

నేలకొరిగిన వరిచేను



కూర్మరాజుపేటలో నేలకొరిగిన వరిచేను

సాలూరు రూరల్: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వరిపంటకు నష్టం వాటిల్లింది. ఇప్పటికే కోతలు పూర్తిచేసి పొలాల్లో ఉంచిన వరి పనలు తడిచిముద్దవగా.. కోతదశకు చేరుకున్న వరిపంట ఈదురుగాలులకు నేలకొరిగింది. కూర్మరాజుపేట గ్రామంలో రైతు కుర్నేన ఆదినారాయణకు చెందిన రెండుఎకరాల వరి చేనులో కొంత భాగం వర్షాలకు నేలమట్టమైంది. వర్షాలు ఇలాగే మరో రెండురోజులు కురిస్తే ధాన్యం మొలకలు వచ్చి నష్టపోయే ప్రమాదం ఉందని రైతు ఆందోళన చెందుతున్నారు.

నేడు హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ

పార్వతీపురంటౌన్: అంతర్జాతీయ ఎయిడ్స్ డే సందర్భంగా పట్టణంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్టు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఎం.వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఉదయం 8 గంటలకు కలెక్టరేట్ వద్ద కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ర్యాలీని ప్రారంభిస్తారన్నారు. కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఎన్‌జీఓ హోమ్ వరకు ర్యాలీ సాగనుందని వెల్లడించారు. ర్యాలీలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సీ వలంటీర్లు, కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలి



రహదారిని పరిశీలిస్తున్న తహసీల్దార్ షేక్ ఇబ్రహీం

మక్కువ: మండలంలోని సంబర గ్రామంలో పోలమాంబ సిరిమాను తిరిగే నడిమి వీధిలో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ షేక్ ఇబ్రహీం కోరారు. శంబర గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. గ్రామంలో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులపై గ్రామస్తులతో చర్చించారు. గ్రామస్తుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

బలిజిపేట: ఈ నెల 10, 11 తేదీల్లో కురుపాంలో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు మన్మథరావు, సత్యనారాయణ కోరారు. ఈ మేరకు శనివారం బలిజిపేటలో ప్రజా సంఘాల కార్యాలయం వద్ద మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సీపీఎం చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గిరిజన పేద విద్యార్థులకు ఇంజినీరింగ్, పీజీ కోర్సులు వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రజా సమస్యలపై రెండు రోజుల పాటు నిర్వహించే మహాసభలో చర్చించి, భవిష్యత్ పోరాటాలపై తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బి.భానుమూర్తి, ఎ.సాంబమూర్తి, వెంకటస్వామి, జి.బలరాంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

సాలూరు: పట్టణంలోని 21వ వార్డులో స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ నెల ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తోందని తెలిపారు. అనంతరం నీటి సంఘాల ఎన్నికలపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో తన స్వగృహంలో సమావేశమై పలు సూచనలు చేశారు.టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్, నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఇచ్చిన హామీ అమలుచేయాలి



మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న వలంటీర్లు, సీఐటీయూ నాయకులు

సాలూరు: వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, రూ.10 వేల వేతన హామీ నెరవేర్చి, జాబ్ ఛార్ట్ ప్రకటించాలని గ్రామ, వార్డు వలంటీర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద గ్రామ, వార్డు వలంటీర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శనివారం పలువురు వలంటీర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు ఎన్.వై.నాయుడు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు వలంటీర్లకు రూ.10 వేలు వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వలంటీర్లకు ఏప్రిల్, మే నెలల వేతనాలు, బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు.

సరైన జీవనశైలితోనే మెరుగైన ఆరోగ్యం

- డీఎంఓ డాక్టర్ టి.జగన్మోహనరావు



మాట్లాడుతున్న డీఎంఓ డాక్టర్ టి.జగన్మోహనరావు

సీతానగరం: సరైన జీవనశైలి, ఆహార నియమాలను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పి.పావనితో కలిసి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న హెల్త్ స్క్రీనింగ్ వివరాలపై ఆరాతీశారు. విద్యార్థుల ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్, ఇతర ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆరోగ్య సూత్రాలను విద్యార్థులకు వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనారోగ్యానికి గురైతే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి, చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎల్.దాలినాయుడు, హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి, సూపర్‌వైజర్స్ సత్యవతి, జయగౌడ్, శర్మ, వైద్యసిబ్బంది సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో సమాజానికి ముప్పు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. పెదభోగిలిలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసైతే ఆరోగ్యం పాడవుతుందని, కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణాలు సాగించాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించొద్దని, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్ నంబరు, ఓటీపీ వంటివి ఇతరులతో షేర్ చేసుకోవద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై ఎల్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాల సేకరణ ధరలు పునరుద్ధరించాలి

పార్వతీపురం: విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాలు సేకరణ ధరను పెంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు కోరారు. ఈ మేరకు మండలంలోని సంగంవలసలో విశాఖ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంస్థ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాల సేకరణ ధరను లీటరుకు రూ.3 నుంచి రూ.4లు వరకు తగ్గించడంతో పాల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. పశుదాణ, గ్రాసం, పశువైద్యం, కృత్రిమ గర్భధారణ, తదితర ధరలు పెరిగాయని, అందుకు అనుగుణంగా డెయిరీ యాజమాన్యం పాలసేకరణ ధర కూడా పెంచాలన్నారు. విశాఖ డెయిరీలో రైతులకు రూ.250 కోట్ల షేర్ క్యాపిటల్ ఉందని, అందుకు అనుగుణంగా రైతులకు డివిడెంట్లు అందడం లేదన్నారు. డెయిరీని సహకార చట్టం 1964 పరిధిలోకి తీసుకొచ్చి పక్క రాష్ట్రాల్లో మాదిరిగా రైతులకు రూ.5లు ప్రోత్సాహకాలు చెల్లించాలన్నారు. అవినీతిపై విచారణకు, పాలసేకరణ ధరను పెంచేందుకు డిసెంబర్ 2న విశాఖ డెయిరీ కేంద్ర కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో పాలరైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంగంవలస రైతు సంఘం మండల నాయకులు వెలమల సత్యనారాయణ, బడే వాసునాయుడు, బీవీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయవాది గురజాడ



పార్వతీపురంటౌన్: గురజాడ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



పార్వతీపురం: రైతుబజారు సమీపంలో గురజాడ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంచిపల్లి శ్రీరాములు, తదితరులు

పార్వతీపురం/పార్వతీపురంటౌన్/బలిజిపేట:
సంఘ సంస్కర్త, సాహితీవేత్త, అభ్యుదయ రచయిత గురజాడ వెంకట అప్పారావు వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన రచనలతో సమాజాన్ని మేల్కొల్పిన మహనీయుడు, సాహితీలోకంలో ఒక ధ్రువతారగా వెలుగొందిన మహానుభావుడు గురజాడ అని కొనియాడారు. విజయనగరం ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపచేసిన ఆ మహనీయుడిని స్మరించుకోవడం మనందరి అదృష్టంగా భావించాలన్నారు.

తోపుడుబండ్ల వర్తకులకు ఉపాధి కల్పించండి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న చిరువ్యాపార్తులు

పార్వతీపురంటౌన్: తోపుడుబండ్లపై వ్యాపారాలపై వేధింపులు నిలుపుదల చేయాలని, రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని తోపుడుబండ్ల చిల్లర వర్తకుల సంక్షేమ సంఘం కార్యదర్శి బంకురు సూరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నాలుగు రోడ్ల కూడలి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ, మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరికి, కమిషనర్ శ్రీనివాసరాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నివాసానికి వెళ్లి ఆయన వద్ద తమ ఆవేదన చెప్పుకున్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, జిల్లా నాయకులు వాకాడ ఇందిర, చిల్లర వర్తకుల సంఘం నాయకులు కోలా రాజు, నిమ్మకాయల సుందరరావు, రాజాన రాజు, తదితరులు పాల్గొన్నారు.

కళ్లాల్లో ధాన్యం మిల్లులకు తరలించాలి

సీతానగరం: తుఫాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ ఎస్.అవినాష్ సూచించారు. మండలంలోని రామవరం, పెదభోగిలి, తామరఖండి, మనిపివలస గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణం ప్రతికూలంగా ఉన్నందున రైతులు కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇప్పటికే నూర్పులు చేపట్టిన రైతులు ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కోరారు. ధాన్యం తరలింపునకు వీలుగా ట్రాక్టర్లు, లారీలను సిద్ధం చేసినట్లు చెప్పారు. మండలంలోని 34,000 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, ప్రస్తుతానికి 3,400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు చేరవేసినట్లు చెప్పారు.

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు

సాలూరు రూరల్: మండలంలోని యరగడవలస గ్రామ కూడలి నుంచి బూర్జివలస కూడలి వరకు రోడ్డు పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డులో పామాయిల్ కాటా ఉండటంతో పామాయిల్ లోడులో వెళ్లే ట్రాక్టర్లు రోడ్డు గుంతల కారణంగా తరచూ మోరాయిస్తున్నాయి. దీంతో స్థానిక రైతు బసవయ్య ఆధ్వర్యంలో రైతులు తమ సొంత నిధులతో రోడ్డుపై గుంతలు పూడ్చేందుకు పూనుకున్నారు. శనివారం జేసీబీ సాయంతో గుంతలు పూడ్చివేసి రోడ్డును చదునుచేశారు.

పారదర్శకంగా హౌస్‌హోల్డ్ సర్వే

సీతానగరం: మండలంలో చేపట్టిన హౌస్‌హోల్డ్ సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. రంగంపేట, పణుకుపేట, కె.ఎస్.పురం, పెదభోగిలి, వెంకటాపురం గ్రామాల్లో శనివారం చేపట్టిన పింఛన్ల పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు గ్రామాల్లో హౌస్‌హోల్డ్ సర్వే త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఇప్పటివరకు 36 శాతం గృహాల సర్వే పూర్తయినట్లు తెలిపారు. నిర్దేశిత గడువులోగా సర్వే పూర్తిచేసేందుకు అవసరమైన పరికరాలు సమకూర్చినట్లు చెప్పారు. ఆయనతో పాటు ఎన్యూమరేటర్లు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

లక్ష దీపోత్సవం



పట్టణంలోని కామాక్షమ్మ ఆలయ ప్రాంగణంలో శనివారం సాయంత్రం లక్ష దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దీపాలు వెలిగించారు. కార్తీకమాసం చివరి అమావాస్య సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

– సాలూరు

మున్సిపల్ కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

సాలూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.వై.నాయుడు, కార్మికులు డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు ప్రతీ నెల 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీఓ–36 ప్రకారం డ్రైవర్లకు రూ.24,500 చెల్లించాలని, శ్యామలాంబ పండుగ దృష్ట్యా అదనపు కార్మికులను నియమించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని, లేదంటే నిరవధిక సమ్మెకు వెళతామని స్పష్టం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించడంతో ఆందోళన విరమించారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురంటౌన్: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పంచాయతీలకు మంజూరు చేసే నిధులతో గ్రామాలను ప్రణాళికయుతంగా అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పార్వతీపురం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ మజ్జి శోభారాణి అధ్యక్షతన శనివారం జరిగిన బడ్జెట్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధులు నేరుగా పంచాయతీ ఖాతాల్లోనే వేయడం జరుగుతుందని, వాటిని ప్రణాళిక బద్ధంగా వినియోగించుకుని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. అనంతరం పరిపాలన అధికారి రమణమూర్తి 2024–25 సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్‌తో పాటు 2025–26 సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్ వివరాలను చదివి వినిపించారు. సభ్యులంతా బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. ఎంపీడీఓ రూపేష్, వైస్ ఎంపీపీ సిద్ధ జగన్నాథరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవు

- టౌన్ సీఐ మురళీధర్



రహదారి ఆక్రమణలు చేసిన వారిని హెచ్చరిస్తున్న సీఐ మురళీధర్

పార్వతీపురంటౌన్: వ్యాపారం చేసుకోండి, కుటుంబాన్ని పోషించుకోండి కానీ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించి వాహనాలను రోడ్డుపైన నిలుపుదల చేయడం సరైన పద్ధతి కాదని టౌన్ సీఐ మురళీధర్ వ్యాపారస్తులకు హెచ్చరించారు. పట్టణంలోని రహదారి ఆక్రమణలను శనివారం తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా వ్యాపారాలు చేసుకోవాలని, నిబంధనలు అతిక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వ్యాపారులపై చర్యలు తప్పవని సున్నితంగా వారిని హెచ్చరించారు. ఆయన వెంట ట్రాఫిక్ ఎస్సై పాపయ్య, సిబ్బంది ఉన్నారు.

వాడివేడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెపుతున్న అధికారులు

సాలూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. గత ప్రభుత్వంలో చేపట్టిన 'గడపగడపకు మన ప్రభుత్వం' పనులకు సంబంధించి కొన్ని పనులకు 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్ నుంచి నిధుల కేటాయింపు అంశంపై వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరి రఘు, రాపాక మాధవరావు, తదితరులు ప్రశ్నించారు. దాదాపు అన్ని వార్డుల్లో జీజీఎంపీ బిల్లులు చెల్లింపు చేయాల్సి ఉండగా.. కేవలం కొన్ని వార్డుల్లో చేసిన పనులకు నిధుల చెల్లింపునకు ప్రతిపాదనలు చేయడం ఏమిటని నిలదీశారు. మున్సిపాలిటీలో కార్మికులు, సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. సామాజిక మరుగుదొడ్లు శుభ్రం చేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. వచ్చే ఏడాదిలో పట్టణంలో శ్యామలాంబ పండుగ నేపథ్యంలో వార్డుల్లో గుర్తించిన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేయాలని కోరారు. వార్డుల్లో మంజూరైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు లోకల్ కాంట్రాక్టర్లు ముందుకొచ్చి నెలలు దాటుతున్నా.. పనులు ఎందుకు చేయించడం లేదని అధికారులను నిలదీశారు. మంత్రి సంధ్యారాణి అంగీకారం కోసం ఆగామని, పనులు చేసుకోమని నిన్న(శుక్రవారం) మంత్రి చెప్పారని, వెంటనే పనులు ప్రారంభిస్తామని మున్సిపల్ డీఈ ప్రసాద్ సమాధానమిచ్చారు. 25వ వార్డులో మౌలిక వసతులు కల్పించాలని పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని, ఇప్పుడైనా మా వార్డులో మౌలిక వసతులు కల్పించాలని స్థానిక కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు అధికారులను కోరారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు.